## హనుమకొండ జిల్లాలో గురుకుల పాఠశాలల ఆకస్మిక తనిఖీ

తెలుగు గళం న్యూస్ హనుమకొండ, జూలై 11



హనుమకొండ జిల్లాలోని పలు గురుకుల విద్యాసంస్థలను టీజీపీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుల అశోక్ ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులకు అందుతున్న వసతి, విద్యా సౌకర్యాలు, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థుల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటింగ్ అధికారి పి. సుధాకృష్ణను కలిసి హసన్‌పర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. హాస్టల్ గదులు, తరగతి గదులు, డైనింగ్ హాల్, తాగునీరు, పారిశు ద్ధ్యం వంటి సౌకర్యాలను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను నమోదు చేసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం వరంగల్ ఈస్ట్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ డిగ్రీ కళాశాలను సందర్శించిన పసుల అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ వి. రాధిక, అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమయ్యారు.కళాశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెన్నమల్ల వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి జంపయ్య, జాయింట్ సెక్రటరీ మద్దెల రవికుమార్, కోశాధికారి ఎస్. వేణు తదితరులు పాల్గొన్నారు.



## జప్తులో ఉన్న ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవాలి

### వరంగల్ ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి

తెలుగు గళం న్యూస్ వరంగల్, జూలై 11



కాజీపేట, వరంగల్, హనుమకొండ ట్రై సిటీస్ ప్రాంత ప్రజలకు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కీలక విజ్ఞప్తి చేశారు. కరోనా కాలం నుంచి వివిధ కారణాలతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జప్తు చేసి ఉంచిన ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు సరైన పత్రాలతో వచ్చి స్వాధీనం చేసుకోవాలని సూచించారు.వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ బుక్, బీమా, గుర్తింపు పత్రాలు తదితర అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి వాహనాలను తీసుకెళ్లవచ్చని తెలిపారు.డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం లేదా పెండింగ్ చలాన్లు వంటి కేసులు ఉన్నట్లయితే, వాటిని త్వరితగతిన పరిష్కరించుకుని అనంతరం వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.కాజీపేట, వరంగల్, హనుమకొండ ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ వాహనాలను ఆలస్యం చేయకుండా స్వాధీనం చేసుకోవాలని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోడూరి సుజాత విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించాలని ఎంపీ కడియం కావ్యకు తపస్ వినతి



తెలుగు గళం న్యూస్ హన్మకొండ,జూలై 11

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు చల్లా తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంకం సతీష్ కుమార్ తదితరులు ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్యను కలిసి పలు ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించే అంశాన్ని రాబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీని కోరారు.అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ఎంపీ కడియం కావ్య హామీ ఇచ్చినట్లు తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం సతీష్ కుమార్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు మరణించిన యువ ఉద్యోగి కుటుంబానికి తోటి సిబ్బంది ఆర్థిక సాయం




తెలుగు గళం :వికారాబాద్ జిల్లా, పరిగి పరిధిలోని డెనోవా అగ్రి లిమిటెడ్ (సీడ్స్ ౘ పేస్టిసైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్) కంపెనీలో పనిచేస్తున్న గంగ్యాడ గ్రామానికి చెందిన శివ అనే యువకుడు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడం పట్ల తోటి ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత శుక్రవారం రాత్రి విధులకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శివ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తన సహోద్యోగి అకాల మరణాన్ని జీర్ణించుకోలేకపోయిన డెనోవా అగ్రి కంపెనీ ఉద్యోగులందరూ కలిసి, బాధిత కుటుంబానికి తమవంతు ఆర్థిక భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పరిగి కేంద్రంలో శివ కుటుంబ సభ్యులను కలిసి, తమ సానుభూతిని తెలియజేస్తూ పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీకి చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ గడువును జూలై 31 వరకు పొడిగించాలి

### బీఆర్ఎస్ నేత నగేష్ ముదిరాజ్

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ జులై 11



ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రజలు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించే గడువును ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు పొడిగించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నగేష్ ముదిరాజ్ భారత ఎన్నికల సంఘాన్ని కోరారు.ముషీరాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి, బీఎల్ఓలు శ్రీనివాస్, రమేశ్, సూపర్వైజర్లు సునంద, హారతిలతో మాట్లాడి ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు డివిజన్లలో ఎన్యుమరేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోందని, ప్రజలందరికీ అవకాశం కల్పించేందుకు గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను మొదటగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు నిర్వహించారని నగేష్ ముదిరాజ్ పేర్కొన్నారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు.ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, నేత శ్రీను, ఆకారం శ్రీను, రవి యాదవ్, కిరణ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## 2001లో కొనుగోలు చేసిన 10 గుంటల భూమిపై వివాదం

**25 ఏళ్లుగా సాగు చేస్తున్నామని బాధితుల వాదన**

**మరో వ్యక్తి పేరుతో పట్టా నమోదైందని ఆరోపణ**

**కొనుగోలు అగ్రిమెంట్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడి**

**25 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమి మా పేర పట్టా చెయ్యాలని విజ్ఞప్తి**

తెలుగు గళం న్యూస్ హనుమకొండ, జూలై 11




హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో భూ వివాదం వెలుగులోకి వచ్చింది. 2001లో కొనుగోలు చేసిన 10 గుంటల వ్యవసాయ భూమిని గత 25 ఏళ్లుగా తామే నిరంతరంగా సాగు చేసుకుంటూ వస్తున్నామని ఆకారపు రాజమ్మ, రాచమల్లు వెంకటస్వామి కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఇటీవల అదే భూమికి రాజారపు విజయ్ తన పేరుతో పట్టా చేయించుకున్నారని ఆరోపిస్తూ శనివారం విలేకరుల సమావేశంలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు.బాధితుల కథనం ప్రకారం, 2001లో సంబంధిత భూమిని కొనుగోలు చేసినప్పటి నుంచి ప్రతి ఏడాది వ్యవసాయ సాగు చేస్తూ భూమిపై పూర్తి ఆధిపత్యంతో ఉన్నామని తెలిపారు. తమ వద్ద కొనుగోలు అగ్రిమెంట్‌తో పాటు ఇతర సంబంధిత పత్రాలు కూడా ఉన్నప్పటికీ, ఇటీవల తమకు తెలియకుండా భూమి పట్టా మరో వ్యక్తి పేరుపై నమోదైందని ఆరోపించారు. దీనివల్ల తమ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైందన్నారు.ఈ వ్యవహారంపై సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.అలాగే ధర్మసాగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి న్యాయం చేయాలని కోరామని చెప్పారు. తమ ఫిర్యాదుపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత భూ పత్రాలను పరిశీలించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)కి ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.ఆర్ఐ గ్రామానికి వెళ్లి భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించడంతో పాటు, చుట్టుపక్కల రైతులు, స్థానికుల ద్వారా వాస్తవ పరిస్థితులపై వివరాలు సేకరించినట్లు బాధితులు తెలిపారు. ప్రస్తుతం భూమి కాస్తులో ఉన్న రజినికుమార్ వ్యవసాయ పనులు కొనసాగించాలని, మరోవైపు రాజారపు విజయ్‌ను పిలిపించి అన్ని పత్రాలను పరిశీలించిన అనంతరం సమస్యను పరిష్కరిస్తామని ఆర్ఐ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.అయితే, తమకు చట్టబద్ధంగా న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని బాధితులు తెలిపారు. 25 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిపై తమకే హక్కు ఉందని, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీసి తమ భూమిని తమకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నష్కల్ గ్రామంలో శరవేగంగా ఎస్ఐఆర్ కార్యక్రమం

**60 శాతం దరఖాస్తుల స్వీకరణ పూర్తి**

**వలసదారులు త్వరగా వచ్చి దరఖాస్తులు సమర్పించాలని సర్పంచ్ శాతబోయిన రాజు యాదవ్ విజ్ఞప్తి**

**ఈ నెల 24 వరకే అవకాశం -- ఆ తర్వాత దరఖాస్తులు స్వీకరించరు**

తెలుగు గళం న్యూస్ జనగామ, జూలై 11







జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం శరవేగంగా కొనసాగుతోంది.గ్రామంలో ఇప్పటివరకు సుమారు 60 శాతం దరఖాస్తుల స్వీకరణ పూర్తైనట్లు అధికారులు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శాతబోయిన రాజు యాదవ్ మీడియాతో మాట్లాడుతూ, గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన గ్రామస్థులు ఈ నెల 24వ తేదీలోపు తప్పనిసరిగా గ్రామానికి వచ్చి తమ దరఖాస్తులు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గడువు ముగిసిన తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబడవని పేర్కొంటూ, ప్రతి అర్హ ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గ్రామంలోని ప్రతి అర్హ ఓటరు ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఐడీఓసీలో ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు

**చిన్న కుటుంబంతోనే సమగ్ర అభివృద్ధి అన్న డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్**

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి






ఆర్థిక అభివృద్ధి, మెరుగైన ఆరోగ్యం, నాణ్యమైన విద్య, సమానత్వం బాధ్యతయుతమైన జీవన విధానం కేవలం చిన్న కుటుంబంతోనే సాధ్యమవుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ స్పష్టం చేశారు.శనివారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ భవనంలో గల డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని, 2026 సంవత్సరానికి గాను "యువత ఆశలు ఆకాంక్షలు నెరవేర్చడం: నేడు మరియు భవిష్యత్తు కోసం" అనే ప్రధాన థీమ్‌తో ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు వెల్లడించారు. తెలంగాణలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ, ఆరోగ్య సంరక్షణ, సుస్థిర అభివృద్ధిపై విస్తృత ప్రచారం జరుగుతోందని, అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా జూలై 11 నుంచి 18 వరకు వారం రోజుల పాటు జనాభా నియంత్రణ, మాతా శిశు సంరక్షణ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రకటించారు.ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ, బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడు సంవత్సరాల కాలం ఎడం ఉండాలని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వివిధ రకాల కుటుంబ నియంత్రణ పద్ధతులను గ్రామీణ స్థాయి వరకు ప్రజలు అలవర్చుకునేలా చూడాలన్నారు. దీనివల్ల తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉంటారని, సమాజానికి హానికరమైన బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని పిలుపునిచ్చారు. జిల్లాలోని విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో జనాభా నియంత్రణ,వనరుల సద్వినియోగంపై ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో రానున్న జూలై 13వ తేదీన జిల్లావ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని కూడా వైద్య సిబ్బంది, ఇతర శాఖల సమన్వయంతో అత్యంత పగడ్బందీగా, విజయవంతంగా పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ అధికారులను, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.అనంతరం జిల్లాలో కుటుంబ నియంత్రణ వైద్య సేవల్లో, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు వైద్యులను,సిబ్బందిని, ఆదర్శ మహిళలను డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ శాలువాలు కప్పి,మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.ఉత్తమ సేవలందించిన వారిలో బెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్‌గా నిలిచిన జీజీహెచ్ డాక్టర్ దివ్య,గైనకాలజిస్ట్ డాక్టర్ కేజీయ,భూపాలపల్లికి చెందిన డాక్టర్ రోహిణి,మొగుళ్లపల్లి ఏఎన్ఎం శ్రీలత, పోట్లపల్లి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త రాజశ్రీలు సన్మానం పొందిన వారిలో ఉన్నారు.వీరితో పాటు కేవలం ఒకే బిడ్డను కలిగి ఉండి, బాధ్యతాయుతంగా ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచిన భూపాలపల్లి రాజీవ్ కాలనీకి చెందిన మధుమిత (భర్త సంతోష్)ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.ఈ బృహత్తర అవగాహన కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, సందీప్, డెమో కె. శ్రీదేవి, ఏఎంఓ సుధాకర్‌తో పాటు జిల్లాలోని హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు,ఆశా కార్యకర్తలు,కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

